

గురుకులాల్లో మిగులు సీట్ల భర్తీ

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో 2024-25 విద్యా సంవత్సరానికి గానూ ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేస్తున్నట్లు గురుకులాల సమన్వయకర్త ఎం.బాలాజీ నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరానికి ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన 11 గురుకులాల్లో ఆరో తరగతి నుంచి తొమ్మిదో తరగతి వరకు ఖాళీగా ఉన్న మిగులు సీట్లను భర్తీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సీట్లలో చేరాలనుకునే విద్యార్థులు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల, కళాశాలలకు ఈనెల 26వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈనెల 29న ఉదయం పది నుంచి 11 గంటల వరకు గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో ప్రవేశ పరీక్ష నిర్వహించి మిగులు సీట్లను కేటాయించనున్నట్లు తెలిపారు.


అచ్చెన్నాయుడు


గోవిందరావు


రమణమూర్తి


శిరీష


రవికుమార్


అశోక్


శంకర్


ఈశ్వరరావు

... అనే నేను

శాసనసభలో ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకారం

జిల్లా నుంచి నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్యేలు శాసనసభలో శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. 16వ శాసనసభ సమావేశాల్లో ఎమ్మెల్యేలతో ప్రొటెం స్పీకర్ గోరంట్ల బుచ్చయ్య చౌదరి ప్రమాణ స్వీకారం చేయించారు. ఇచ్ఛాపురం, పలాస, టెక్కలి, నరసన్నపేట, శ్రీకాకుళం, ఆమదాలవలస, పాతపట్నం, ఎచ్చెర్ల నియోజకవర్గాల ఎమ్మెల్యేలు బెందాళం అశోక్, గౌతు శిరీష, కింజరాపు అచ్చెన్నాయుడు, బగ్గు రమణమూర్తి, గొండు శంకర్, కూన రవికుమార్, మామిడి గోవిందరావు, నడుకుదిటి ఈశ్వరరావు సభ్యుల హర్షధ్వానాల నడుమ ప్రమాణ స్వీకారం చేశారు.



ఇదేం ప్రక్షాళన?

- అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న వారికి కీలక పోస్టులు
- అవినీతి ఆరోపణలపై టిడిపి హయాంలోనే ఎస్ఇ రాంబాబు బదిలీ
- ఆఫ్‌షోర్‌కు అదనపు బిల్లులు, షట్టర్ల అవినీతిలో శేఖర్‌రావు పాత్ర!
- వారికే తిరిగి పోస్టింగ్‌లు ఇవ్వడంపై అధికారుల్లో విస్మయం


'జిల్లాలో ఐదేళ్లుగా ప్రభుత్వ శాఖలు పూర్తిగా పనిచేయడం మానేశాయి. కొన్ని ముఖ్యమైన శాఖలు నిర్వీర్యమైపోయాయి. మాపై కనీస గౌరవ, మర్యాదల్లేకుండా అధికారులు ప్రవర్తించారు. సాగునీటి శాఖలకు తాళాలు వేసేశారు. గతంలో ఇష్టానుసారంగా వ్యవహరించిన పోలీసులను మళ్లీ ఇక్కడికే తీసుకొచ్చి, వారితోనే సిస్టమ్‌ను సెట్‌రైట్ చేస్తే వారికి తెలిసొస్తుంది'. ఈనెల 18న జెడ్‌పిలో అధికారులతో నిర్వహించిన ముఖాముఖిలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు చెప్పిన మాటలు ఇవి. ఆయన చేతలు మాత్రం వేరేగా ఉన్నాయి. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న వారినే మళ్లీ జిల్లాకు రప్పిస్తుండడంతో ఆయన ద్వంద్వవైఖరి తేటతెల్లమవుతోంది.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

రాష్ట్రంలో అధికార మార్పిడి జరిగిన ప్రతి సందర్భంలో మంత్రులు, ఎమ్మెల్యేలు అప్పటివరకు పనిచేస్తున్న వారిని సాగనంపడం... తమ వారిని, తమకు అనుకూలంగా ఉండే వారిని జిల్లాకు తీసుకురావడం సాధారణం. గత ప్రభుత్వ హయాంలో పనిచేసిన అధికారుల తీరు నచ్చకో, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తమకు కనీస గౌరవం ఇవ్వలేదనో ఇతర కారణాలతో కొందరు అధికారులను బదిలీ చేయడం సర్వసాధారణ అంశం. జిల్లాలో కొత్తగా ఎన్నికైన అధికార పార్టీ ప్రజాప్రతినిధులు తమకు నచ్చని అధికారులపై అవినీతి ముద్ర వేస్తుండడం తటస్థిస్తుంది. ప్రస్తుతం చోటుచేసుకుంటున్న బదిలీల విషయంలో అదే జరుగుతోంది. వైసిపి హయాంలో పనిచేసిన అధికారులను ఒక్కొక్కరినీ సాగనంపేందుకు అధికార పార్టీ ప్రజాప్రతినిధులు ప్రయత్నాలు మొదలుపెట్టారు. అందులో భాగంగానే వంశధార పర్యవేక్షక ఇంజినీరుగా ఉన్న డోల తిరుమలరావును విశాఖపట్నం క్వాలిటీ కంట్రోల్ విభాగం ఇఇగా బదిలీ చేశారు. ఆ స్థానంలో విజయవాడ ఇరిగేషన్ విభాగంలో పనిచేస్తున్న బి.రాంబాబును ఎస్ఇగా నియమించారు. వంశధార ప్రాజెక్టు టెక్కలి డివిజన్ ఇఇగా బి.శేఖర్‌రావును నియమించారు. డిఇఇ కె.శ్రీకాంత్‌ను బదిలీ చేసి, ఆయన స్థానంలో శేఖర్‌రావును నియమించారు. ప్రస్తుతం వీరిద్దరి నియామకంపై వంశధార ప్రాజెక్టు ఉద్యోగుల్లో తీవ్ర చర్చ సాగుతోంది.

అవినీతి ఆరోపణలపై నాడు బదిలీ... నేడు జిల్లాకు

వంశధార ఎస్ఇగా రాంబాబు నియామకంపై అనేక విమర్శలు వినిపిస్తున్నాయి. ఎస్ఇ రాంబాబు అంతకుముందు టిడిపి ప్రభుత్వ హయాంలో వంశధార ఎస్ఇగా ఇక్కడే పనిచేశారు. వంశధార నిర్వాసితుల ఆర్అండ్ఆర్ విషయంలో చోటుచేసుకున్న అక్రమాలపై అప్పట్లో కార్మికశాఖ మంత్రిగా ఉన్న కింజరాపు అచ్చెన్నాయుడు సీరియస్ అయ్యారు. చర్యలకు అప్పటి కలెక్టర్‌కు ఆదేశాలు జారీ చేశారు. అక్రమాలతో సంబంధం ఉన్న డిఇ శ్రీనివాసరావును సస్పెండ్ చేసి, ఎస్ఇ రాంబాబును తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరం ప్రాజెక్టుకు బదిలీ చేశారు. అక్కడా ఆర్అండ్‌బి, ధవళేశ్వరం ప్రాజెక్టు అధికారులు ఇద్దరూ ఒకేచోట రెండు వంతెనలను నిర్మించడంతో రాంబాబుపై ఛార్జిమెమో దాఖలు చేసి విజయవాడకు బదిలీ చేసినట్లు తెలుస్తోంది. ఇప్పటివరకు విజయవాడలో పనిచేస్తున్న ఆయన్ను తానే తీసుకొచ్చినట్లు మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఇటీవల జెడ్‌పి సమావేశంలో బహిరంగంగానే చెప్పారు.


మోదుగులపుట్టిలో వంశధార కాలువను పరిశీలిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు (ఫైల్)
(ఇన్‌సెట్‌లో ఎస్ఇ రాంబాబు, ఇఇ శేఖర్‌రావు)

టెక్కలి ఇఇ శేఖర్‌రావు లీలలెన్నో...

వంశధార సర్కిల్ టెక్కలి డివిజన్ ఇఇగా నియమితులైన శేఖర్‌రావు అనేక అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఈయన కూడా టిడిపి హయాంలో టెక్కలి విభాగంలోనే పనిచేశారు. ఆఫ్‌షోర్‌కు సంబంధించిన జరగని పనులకూ బిల్లులు చెల్లించారన్న ఆరోపణలు అప్పట్లోనే వెల్లువెత్తాయి. పనులకు సంబంధించి రూ.కోటి వరకు అదనంగా చెల్లించినట్లు ఆయనే అంగీకరించి లెటర్ కూడా రాసిచ్చినట్లు ఉద్యోగులు చెప్పుకుంటున్నారు. ఇఇ శేఖర్‌రావు హయాంలో టెక్కలి డివిజన్‌కు అప్పటి టిడిపి ప్రభుత్వం నీరు-చెట్టు కింద కేటాయించిన రూ.ఆరు కోట్లలో శాశ్వత స్ట్రక్చర్ల పనులు చేయకుండా మట్టి పనులు చేసి నిధులను సక్రమంగా ఖర్చు చేయలేదన్న ఆరోపణలూ లేకపోలేదు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆయన్నూ విజయవాడకు బదిలీ చేశారు. అదీగాక 2009లో చోటుచేసుకున్న షట్టర్ల అవినీతిలో ఆయన పాత్ర ఉన్నట్లు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ గుర్తించి కేసు కూడా నమోదు చేసింది. వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు మళ్లీ శేఖర్‌రావును అదే పోస్టులో నియమించడంపై అనేక విమర్శలు వినిపిస్తున్నాయి.

వారిద్దరినే ఎందుకు తీసుకొచ్చినట్లు?

అవినీతి ఆరోపణలపై జిల్లా నుంచి బదిలీ అయిన ఆ ఇద్దరు ఇంజినీరింగ్ అధికారులను తీసుకురావడంపై వంశధార ప్రాజెక్టులో తీవ్ర చర్చ సాగుతోంది. గతంలో వంశధార ప్రాజెక్టులో పనిచేసిన అనుభవంతోనే తీసుకొచ్చారా? వేరే అవగాహన ఏమైనా ఉందా? అని ఉద్యోగుల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి. జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులు, వాటి పరిస్థితులపై అవగాహన ఉన్న ఎంతోమంది ఉత్తరాంధ్రకు చెందిన ఇంజినీర్లు ఉన్నా, వారిని తీసుకురావడంపై అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఇకనుంచైనా అధికారుల నియామకాల విషయంలో జిల్లా ప్రజల ప్రయోజనాలు కోసం పనిచేసే వారిని నియమిస్తే మంచిదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.


యోగాసనాలు వేస్తున్న డిఆర్ఒ గణపతిరావు

యోగాతో మానసిక ఉల్లాసం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్, ఎచ్చెర్ల

యోగాతో మానసిక ఉల్లాసం లభిస్తుందని ఎస్‌పి జి.ఆర్ రాధిక, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు అన్నారు. ఆయుష్ శాఖ, యువజన వ్యవహారాలు, క్రీడలు మంత్రిత్వ శాఖ, నెహ్రూ యువ కేంద్రం సంయుక్త ఆధ్వర్యాన నగరంలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. డిఆర్‌ఒతో పాటు పలువురు అధికారులు యోగాసనాలు వేశారు. ఎచ్చెర్ల జిల్లా ఆర్మ్డ్ రిజర్వ్ పోలీస్ మైదానంలో ఎస్‌పి రాధిక యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యోగాతో మానసిక, శారీరక ఒత్తిళ్లను జయించి సంపూర్ణ ఆరోగ్యవంతులుగా జీవించవచ్చని చెప్పారు. ప్రతిఒక్కరూ చిన్నప్పట్నుంచే యోగాభ్యాసాన్ని అలవాటుగా మార్చుకొని నిరంతర సాధన చేయాలని సూచించారు. నేటి జీవన విధానంలో నిత్యం అధిక ఒత్తిళ్లను ఎదుర్కొంటున్నామని, తద్వారా అనారోగ్యానికి గురయ్యే ప్రమాదముందన్నారు. ఇటువంటి తరుణంలో యోగా చక్కని పరిష్కారమని చెప్పారు. యోగా వల్ల నూతనోత్తేజం లభిస్తుందని, దీనివల్ల మరింత ఉత్సాహంగా పనిచేసేందుకు అవకాశం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆయుష్ సీనియర్ వైద్యాధికారి పి.జగదీష్, ఎఎస్‌పి జి.ప్రేమ్ కాజల్, జిల్లా విద్యాశాఖాధికారి వెంకటేశ్వరరావు, మెప్మా పీడీ కిరణ్, ఆర్ఐఒ దుర్గాప్రసాద్, సెట్‌శ్రీ సిఇఒ బి.వి ప్రసాదరావు, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ చీఫ్ కోచ్ శ్రీధర్, జిల్లా పర్యాటక అధికారి నారాయణరావు, నెహ్రూ యువ కేంద్ర జిల్లా సమన్వయకర్త ఉజ్వల్, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి కె.చెన్నకేశవరావు, ప్రభుత పురుషుల డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సురేఖ, విశ్రాంత జడ్జి పప్పల జగన్నాథం, పలు సంస్థలు, వాకర్స్ క్లబ్‌ల ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.


యోగాసనాలు వేస్తున్న ఎస్‌పి, ఎఎస్‌పి


సబ్ ట్రెజరీ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

సబ్ ట్రెజరీ అధికారులపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - రణస్థలం రూరల్

రణస్థలం సబ్ ట్రెజరీ పరిధిలోని ఉపాధ్యాయుల బిల్లులు చెల్లింపుల్లో ట్రెజరీ అధికారులు తీవ్ర జాప్యం చేస్తున్నారని ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిషోర్ కుమార్ తెలిపారు. సబ్ ట్రెజరీ అధికారుల తీరును నిరసిస్తూ ఆ శాఖ కార్యాలయం వద్ద శుక్రవారం యుటిఎఫ్ ఆధ్వర్యాన ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల జీతాల బిల్లులు, వ్యక్తిగత బిల్లులు పాస్ చేయడానికి తీవ్ర జాప్యం చేస్తున్నారని చెప్పారు. సీనియర్ అకౌంటెంట్‌కు డబ్బులు ముట్టజెప్పనిదే పని చేయడం లేదని విమర్శించారు. డబ్బులు ఇస్తేనే బిల్లులు మంజూరవుతాయని, లేకుంటే చెప్పులరిగేలా తిరగాల్సిన పరిస్థితులు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

ఉపాధ్యాయుల వ్యక్తిగత బిల్లులు సంవత్సరాల నుంచి తిప్పివేస్తున్నారని, వెంటనే వాటిని పరిష్కరించాలని కోరారు. బిల్లుల చెల్లింపుల్లో జాప్యం చేస్తూ డబ్బులు డిమాండ్ చేస్తున్న సబ్ ట్రెజరీ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం సబ్ ట్రెజరీ అధికారికి వినతిపత్రం అందించారు. దీనిపై ఆయన స్పందిస్తూ రానున్న కాలంలో ఇటువంటి తప్పిదాలు చోటుచేసుకోవని చెప్పారు. బాధ్యులపై చర్యలు తీసుకుంటానని హామీనిచ్చారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కోశాధికారి బి.రవికుమార్, రాష్ట్ర కౌన్సిలర్ ఎస్.నారాయణరావు, మండల ప్రధాన కార్యదర్శి ఎల్.కోదండరామయ్య, నాయకులు డి.కోటేశ్వరరావు, టి.శంకరరావు, డి.రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ఖాళీలపై సమగ్ర నివేదిక

ప్రజాశక్తి - పొందూరు


ఎంఇఒలతో మాట్లాడుతున్న డిఇఒ వెంకటేశ్వరరావు

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు డిఎస్‌సికి సంబంధించి జిల్లాలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టుల వివరాలపై సమగ్ర నివేదిక అందించేందుకు కసరత్తు చేస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి కె.వెంకటేశ్వరరావు తెలిపారు. పొందూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల కిట్లకు సంబంధించిన స్టాల్‌ను శుక్రవారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం ఇచ్చిన డిఎస్‌సి నోటిఫికేషన్ ఆధారంగా ఖాళీ పోస్టులు నిర్ణయించామని, ప్రస్తుత ప్రభుత్వం జారీ చేసిన డిఎస్‌సి నోటిఫికేషన్ ప్రకారం ఎక్కువ ఖాళీలను భర్తీ చేయాల్సి ఉందన్నారు. ఇందుకు సంబంధించి రేషనలైజేషన్ ప్రక్రియ పూర్తయిన తర్వాతనే ఖాళీల సంఖ్యను నిర్ధారించడమవుతుందని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల ప్రారం యూడైస్‌కోడ్ ప్రక్రియ కొనసాగుతోందని, దీన్ని తక్షణమే పూర్తి చేయాలని మండల విద్యాశాఖాధికారులను ఆదేశించామన్నారు. జిల్లాలో అన్ని పాఠశాలలకు సకాలంలో పాఠ్యపుస్తకాలు, విద్యార్థుల కిట్లను అందించేలా ప్రణాళికలను రూపొందించామని తెలిపారు. కార్యక్రమంలో ఎంఇఒలు పి.వి రామరాజు, పి.రాజారావు, ప్రధానోపాధ్యాయులు పి.వెంకటరావు, సిఆర్‌పిలు, ఎంఆర్‌సి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాను వినియోగించుకోవాలి

శ్రీకాకుళం అర్బన్ : జిల్లా ఉపాధి కార్యాలయం ప్రతినెలా నిర్వహించే జాబ్‌మేళాలను నిరుద్యోగ అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉపాధి అధికారి కె.సుధ అన్నారు. నగరంలోని నెహ్రూ యువ కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన జాబ్‌మేళాలో 64 మందికి పలు ప్రైవేటు కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిరుద్యోగ అభ్యర్థులు ఆన్‌లైన్‌లో employment.ap.gov.in వెబ్ పోర్టల్ ద్వారా జిల్లా ఉపాధి కార్యాలయంలో ఎంప్లాయిమెంట్ రిజిస్ట్రేషన్ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. జాబ్‌మేళాలో జిల్లా యువజన సంక్షేమ అధికారి వెంకట ఉజ్వల్, సెట్‌శ్రీ సిఇఒ ప్రసాదరావు, ఆయా కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

డయేరియా ప్రబలకుండా చర్యలు

కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

వర్షాకాలం నేపథ్యంలో డయేరియా ప్రబలకుండా ముందుజాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ శుక్రవారం సాయంత్రం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ అనంతరం ఆయన జిల్లా అధికారులతో మాట్లాడారు. డయేరియా వ్యాప్తిని అరికట్టేందుకు విస్తృత ప్రచారం చేపట్టాలని సూచించారు. ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ అధికారులు జిల్లాలో మైక్రో ప్లాన్‌ను అమలు చేయాలన్నారు. కేసుల వ్యాప్తిని అరికట్టేందుకు కమ్యూనికేషన్ స్ట్రాటజీ, మానిటరింగ్ మెకానిజంను అమలు చేయాలని సూచించారు. దీనిపై వర్క్‌షాప్ నిర్వహించడంతో పాటు ఇంటింటి ప్రచారం చేపట్టి ఒఆర్ఎస్ ప్యాకెట్లను అందజేయాలన్నారు. ఆశావర్కర్ల ద్వారా తక్కువ బరువున్న చిన్నారులకు జింక్ ప్యాకెట్లను అందించాలన్నారు. జిల్లాలో పెద్దఎత్తున ఐఇసి యాక్టివిటీలను చేపట్టాలని సూచించారు.

పకడ్బందీ చర్యలు చేపట్టాలి

చిన్నారుల్లో గ్రోత్ మానిటరింగ్ నిర్వహించడంపై అంగన్‌వాడీ వర్కర్లకు శిక్షణ ఇవ్వడం, తక్కువ బరువున్న పిల్లలకు పోషకాహారం అందించాలన్నారు. ఎక్కడా డయేరియా కేసులు వ్యాప్తి చెందకుండా అధికారులు ప్రత్యేక దృష్టిసారించి పకడ్బందీ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, శ్రీకాకుళం మున్సిపల్ కమిషనర్ తమీమ్ అన్సారియా, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, జిల్లా పంచాయతీ అధికారి ఎం.వెంకటేశ్వర్లు, జెడ్‌పి సిఇఒ వెంకటేశ్వరరావు, ఐసిడిఎస్ పీడీ బి.శాంతిశ్రీ, ఉప వైద్యారోగ్యశాఖ అధికారి ప్రసాదరావు, జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వరరావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ జి.జె బెనహర్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం


శ్రీకాకుళం అర్బన్ : యోగాసనాలు వేస్తున్న జిల్లా జడ్జి, న్యాయవాదులు


పొందూరు : యోగాసనాలు వేస్తున్న కోర్టు సిబ్బంది


పలాస : ఆర్‌డిఒకు సన్మానిస్తున్న రామేశ్వరరావు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

యోగాసనాల ద్వారా ఆరోగ్యాన్ని మెరుగుపర్చుకునేందుకు దోహదపడుతుందని, శారీరిక మానసిక ఉల్లాసాన్ని పొందడానికి యోగా ప్రక్రియ సహకరిస్తుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. జిల్లా కోర్టు ఆవరణలో శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవంగా యోగసనాలు వేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ. ప్రాథమిక స్థాయి నుంచి పిల్లలకు యోగా శిక్షణ ఇవ్వాలన్నారు. ప్రతిఒక్కరూ ఆనందంగా, సంతోషంగా, ఆరోగ్యంగా ఉండాలన్నారు. యోగా టీచర్ కొల్లేరు వెంకట్రావు మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా ఆహారపు అలవాట్లు మార్చుకొని మంచి జీవన శైలిని అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాది ఇందిరాప్రసాద్ పాల్గొన్నారు.

అంబేద్కర్ గురుకులంలో...

నగరంలోని పెద్దపాడులోని అంబేద్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ మార్పు జ్యోతి ఆధ్వర్యాన యోగసనాలు వేశారు. కార్యక్రమంలో జిల్లా పర్యాటక శాఖాధికారి నారాయణరావు, నాగావళి హోటల్ ఎండీ ఆనంద్, హోటల్స్ అసోసియేషన్ అధ్యక్షులు మెట్ట నాగరాజు పాల్గొన్నారు.

పోస్టల్ శాఖ ఆధ్వర్యాన...

నగరంలోని పోస్టల్ సూపరింటెండెంట్ కార్యాలయంలో యోగా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ సూపరింటెడెంట్ కె.శ్యాంసుందర్, ఎఎస్‌పి ఎ.శ్రీనివాసరావు, వి.వి.మురళీకృష్ణ, పి.దివాకర్, ఎల్.శరత్‌కుమార్, పి.షణ్ముఖ, బి.పవన్‌కుమార్, ఎన్.కామేశ్వరరావు, కె.రాంబాబు, కె.పావని, ఎర్రయ్య పాల్గొన్నారు.

కాకినాడ శ్రీఆదిత్యలో...

నగరంలోని ఆర్ట్స్ కళాశాల రోడ్డులో ఉన్న కాకినాడ శ్రీఆదిత్య కళాశాలలో యోగా గురువు కొల్లి వెంకటరావు విద్యార్థులతో యోగసనాలు వేయించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎన్.వి.వేణుగోపాల్, వైస్ ప్రిన్సిపాల్ జి.జి.వి.సుబ్రహ్మణ్యం, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ఎం.నాగభూషణరావు పాల్గొన్నారు.

ఎచ్చెర్ల : రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ట్రిపుల్ ఐటి డైరెక్టర్ కొక్కిరాల వెంకట గోపాల ధన బాలాజీ అధ్యక్షతన యోగా వేడుకలు నిర్వహించారు. యోగా గురువు డాక్టర్ ఈశ్వరరావు యోగాసనాలు వేశారు. యోగా వల్ల మానసిక ఒత్తిడి తగ్గి, శారీరక ఆరోగ్యం, జ్ఞాపకశక్తి , మానసిక ప్రశాంతత లభిస్తుందని డైరెక్టర్ తెలిపారు. యోగా మన జీవితంలో ఒక భాగం కావాలన్నారు. కార్యక్రమంలో ఒఎస్‌డి సుధాకర్‌బాబు, పరిపాలన అధికారి మునిరామకృష్ణ, డీన్ కోర్లమోహన్‌కృష్ణ చౌదరి, డాక్టర్ అరుణ బాలాజీ, ఫైనాన్స్ ఆఫీసర్ సల్లా ఆసిరినాయుడు, వెల్ఫేర్ డీన్ గేదెల రవి, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ ముకుందరావు, డాక్టర్ సింహాచలం, డాక్టర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పలాస : మనిషి వికాసానికి యోగా చాలా అవసరమని ఆర్‌డిఒ భరత్ నాయక్ అన్నారు. మండలంలోని రామకృష్ణాపురం సత్యసాయి విద్యా విహార్‌లో నిర్వహించిన యోగా వేడుకల్లో పాల్గొన్నారు. అనంతరం ఆర్‌డిఒకు దుశ్శాలువ కప్పి సన్మానించారు. అనతరం గోకులంలో గ్రీన్‌ఆర్మీ, సత్యసాయి ట్రస్టు ఆధ్వర్యాన మొక్కలు నాటారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ మల్లా రామేశ్వరరావు, ప్రిన్సిపాల్ ప్రీతి చౌదరి, గ్రీన్‌ఆర్మీ అధ్యక్షులు బోనెల గోపాల్, ఇరిగేషన్ అధికారి పి.శ్రీనివాసరావు, ట్రస్టు వైస్ చైర్మన్ తాలాసు శ్రీనివాసరావు, శివప్రసాద్, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విశ్వవిద్యాలయంలో అంతర్జాతీయ యోగా వేడుకల్లో లావేరు మండలం బుడుమూరుకు చెందిన సంజీవిని సేవా సంఘం చిన్నారులు ప్రదర్శించిన పలు రకాల యోగా ఆసనాలు కనపరిచిన ప్రతిభ వర్సిటీ వర్గాలను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో విసి కె.ఆర్.రజని పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు: మండలంలోని పాత టెక్కలి అంగన్వాడీ కేంద్రంలో నిర్వహించిన యోగా వేడుకల్లో కార్యకర్త కరుణ పాల్గొన్నారు.

టెక్కలి రూరల్ : టెక్కలి శంబానవీధి యెగా కేంద్రం, సాయికృష్ణ యోగా కేంద్రం, స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో యోగా డే సందర్భంగా యోగాసనాలు వేశారు. కార్యక్రమంలో యోగా శిక్షకులు గేదల చంద్రశేఖర్ స్థానికులు పాల్గొన్నారు.

లావేరు : యువ టూరిజం క్లబ్, ఎపి ఎన్‌జిసి ఆధ్వర్యాన బుడుమూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన యోగాలో ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు ఎస్.కె.ప్రసాదరావు, జీవశాస్త్ర ఉపాధ్యాయుడు పూజారి గోవిందరావు, ఉపాధ్యాయులు ఎం.అనురాధ, కె.వెంకటరావు, పి.తమ్మినాయుడు పాల్గొన్నారు.

ఆమదాలవలస : ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఆమదాలవలస జాతీయ సేవా పథకం అధికారి, రెడ్‌క్రాస్ నోడల్ ఆఫీసర్, రోటరీ ఉపాధ్యక్షుడు జలుమూరు రవిబాబు ఆధ్వర్యాన యోగా దినోత్సవంలో గురువు లగుడు అప్పన్న, లగుడు లక్ష్మి, రోటరీ అధ్యక్షులు కె.సంజీవరావు, శిల్ల రవి, దుంపల శ్యామలరావు, రవిబాబు పాల్గొన్నారు.

సంతబొమ్మాళి : కెజిబివిలో శ్రీకాకుళం నెహ్రూ యువ కేంద్రం కో-ఆర్డినేటర్ కొయ్యాన మధుసూదనరావు అధ్యక్షతన యోగా వేడుకల్లో భాగంగా యోగసనాలు వేశారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు శైలజ, టిడిపి యువత అధ్యక్షులు కూచెట్టి భానుప్రకాష్ పాల్గొన్నారు.

రణస్థలం రూరల్: యోగాతోనే శారీరకశక్తితో పాటు సంపూర్ణ ఆరోగ్యం ఉంటుందని స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ డైరెక్టర్ నడుకుదిటి తేజబాబు అన్నారు. యోగా దినోత్సవం సందర్భంగా విద్యార్థులు యోగసనాలు వేశారు. ప్రిన్సిపాల్ శ్రీదేవి మహంతి, వైస్ ప్రిన్సిపాల్ ఎన్.సుధీర్ కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆయుర్వేద వైద్యాధికారి ఎం.ప్రసన్నలక్ష్మి యోగాసనాలపై అవగాహన కల్పించారు. ఈమె వెంట జె.రమణ డి.వి.ఆర్.మూర్తి, ఆస్పత్రి సిబ్బంది ఉన్నారు.

టెక్కలి రూరల్ : టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజిమెంట్ ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్, ఎన్సిసి విద్యార్థులకు యోగా వేడుకలు సందర్భంగా యోగా శిక్షకులు గేదెల చంద్రవేఖర్ యోగాసనాలు వేశారు. కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి. నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, డీన్ డాక్టర్ డి.విష్ణుమూర్తి యోగా ఆవస్యకతను వివరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పిఒ డాక్టర్ బి.బలరాం, యోగా శిక్షకులు సత్తారు ఉషారాణి, పిడిలు టి.మురళీ మోహన్, జె.తేజ్వరి తదితరులు పాల్గొన్నారు.

రణస్థలం : మండలంలోని కొండములగాం ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో యోగా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు యోగాసనాలు వేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పొట్నూరు శ్రీధర్, ఉపాధ్యాయులు టి.ప్రసాద్, లక్ష్మణరావు పాల్గొన్నారు.

బూర్జ : బూర్జ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులు యోగాసనాలు వేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, సువ్వాడి తవిటినాయుడు పాల్గొన్నారు.

కవిటి: యోగాతో విద్యార్థుల్లో మానసిక ప్రశాంతత లభిస్తుందని బి.జిపుట్టిగ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి.బాబూరావు అన్నారు. మండలంలోని మండలం బి.జి.పుట్టుగ, కవిటి ఎస్విజె, కళ్యాణి ఆంగ్ల పాఠశాల, బివికె పాఠశాలల్లో విద్యార్థులతో యోగాసనాలు వేయించారు. కార్యక్రమంలో పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు బి.రమేష్, ఎస్విజె ప్రిన్సిపాల్స్ ఎం.భాస్కరరావు, పి.సత్యనారాయణ, ఎన్ఎస్ఎస్ పిఒ ఆర్.మహేష్, జి.జగన్నాయకులు, బివికె ప్రిన్సిపాల్ ఎం.అనిల్ పాల్గొన్నారు.

పోలాకి : మండలం కోడూరు జిల్లా పరిషత్ పాఠశాలలో కిషన్ మోర్చా జిల్లా అధ్యక్షులు సీపాన కృష్ణమూర్తి ఆధ్వర్యాన యోగా దినోత్సవం సందర్భంగా విద్యార్థులు యోగసనాలు వేశారు. కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షులు బిర్లంగి ఉమామహేశ్వరరావు, కరుకోల రమేష్, కరుణాకర్‌రావు, చింతాడ ఉమామహేశ్వరరావు, హైస్కూల్ చైర్మన్ కరుకోల ధర్మేంద్ర పాల్గొన్నారు.

పాతపట్నం: మండలంలోని తెంబూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో సర్పంచ్ బెనియా వెంకటరమణ, హోమియోపతి వైద్యాధికారి ఎస్.ఉమాగౌరి పాల్గొని యోగసనాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అప్పారావు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : పట్టణంలోని జ్ఞానభారతి విద్యాసంస్థల కార్యదర్శి జోహర్ ఖాన్ ఆధ్వర్యాన యోగా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు యోగసనాలు వేశారు. కార్యక్రమంలో వజ్రపు రమణమూర్తి, ప్రిన్సిపాల్ ఐ.బి.పండా, హెడ్‌మాస్టార్ రషీదా సుల్తానా, మేనేజర్ ప్రమోద్‌కుమార్, అలీమ్‌ఖాన్, పిఇటిలు కైలాష్‌కుమార్, పండా, దూబ రాము పాల్గొన్నారు.

పొందూరు: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని జూనియర్ సివిల్ జడ్జి బి.జ్యోత్స్న అన్నారు. పొందూరు జ్యుడిషయిల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు ఆవరణంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా న్యాయవాదులు, కోర్టు సిబ్బందితో కలిసి యోగాసాలను ప్రదర్శించారు. అలాగే తండ్యాంలో ఉపాధి కూలీలో కలిసి ఎంపిడిఒ సిహెచ్.సూర్యనారాయణ, ఎపిఒ పి.శ్రీనివాసరావులు యోగా దినోత్సవాన్ని నిర్వహించారు.

టెక్కలి : కోర్టు ఆవరణలో జూనియర్ సివిల్ జడ్జి ఎస్. హెచ్.ఆర్.తేజచక్రవర్తి అధ్యక్షతన సిబ్బంది యోగాసనాలు వేశారు. కార్యక్రమంలో బార్ ఆసోసియేషన్ అధ్యక్షులు దివ్వల వివేకానంద, న్యాయవాదులు ఖజానా వెంకటరావు, దవళ రాజేశ్వరరావు, కోర్టు సూపరింటెండెంట్ ఎం.రూపావతి, పి.వెంకటరాజు పాల్గొన్నారు.

అలాగే ఓక్లాండ్ ఆంతర్జాతీయ పాఠశాల ఆవరణలో ప్రిన్సిపాల్ మళ్ళ మధులత ఆధ్వర్యాన యోగా దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులు వివిధ ఆకృతిల ద్వారా ఆసనాలు పలువురిని ఆలరించాయి. టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబురు గోవిందమ్మ ఆధ్వర్యాన నిర్వహించిన కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బేపల సతీష్‌కుమార్, ఐక్యూఎసి కో-ఆర్డినేటర్ వి.లూక్‌పాల్, పిఒ కోటేశ్వరరావు, పీడీ బి.సత్యనారాయణ పాల్గొన్నారు. అలాగే మండలంలోని సీతాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన యోగసనాల్లో ప్రదానోపాధ్యాయులు సత్తారు వేణికుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆమదాలవలస : యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని జూనియర్ సివిల్ జడ్జి ఎస్.మణి అన్నారు. కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు కణితి విజయలక్ష్మి భాయ్ ఆధ్వర్యాన యోగా వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో న్యాయవాదులు తమ్మినేని అన్నంనాయుడు, గురుగుబెల్లి ప్రభాకరరావు, బూర్లె సీతారాం, వాడవలస రాజేశ్వరరావు పాల్గొన్నారు.


ఇచ్ఛాపురం : యోగాసనాలు వేస్తున్న జ్ఞానభారతి విద్యార్థులు


టెక్కలి : యోగాసనాలు వేస్తున్న ఒక్లాండ్ విద్యార్థులు


శ్రీకాకుళం అర్బన్ : యోగాసనాలు వేస్తున్న కాకినాడఆదిత్య విద్యార్థులు

అలాగే మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో ఎపిఎం పూడి కూర్మారావు మహిళా సంఘాల సభ్యులకు యోగాసనాలు వేయించారు. కార్యక్రమంలో మండల మహిళా సమాఖ్య ప్రతినిధులు ధనలక్ష్మి, వేణమ్మ, రేణుక, కళ్యాణి పాల్గొన్నారు.

కొత్తూరు : జూనియర్ సివిల్ జడ్జి కే.రాణి ఆధ్వర్యాన కోర్టు ఆవరణలో, ఉన్నత పాఠశాల ఆవరణలో, ఎంపిడిఒ త్రివిక్రమరావు ఆధ్వర్యాన సిబ్బంది, కృష్ణాపురం అంగన్వాడీ కేంద్రం ఐసిడిఎస్ పిఒ విమలకుమారి, సూపర్‌వైజర్ లింగాల శాంతికుమారి ఆధ్వర్యాన సిబ్బంది యోగాసనాలు వేశారు.

శ్రీకాకుళం రూరల్ : మండలంలోని మునసపుపేటలోని గాయత్రి కాలేజీ అఫ్ సైన్స్ అండ్ మేనేజ్‌మెంట్‌లో ప్రిన్సిపాల్ పులకండం శ్రీనివాసరావు ఆధ్వర్యాన యోగా వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో ఐక్యూఎసి కో-ఆర్డినేటర్ డాక్టర్ మార్తండా కృష్ణ, ఎన్ఎస్ఎస్ నిర్వహణాధికారి మహేష్, ధన్వంతరి, రాజ్‌కుమార్, రమణమూర్తి, అప్పలనాయుడు, గోపాలరావు, హరేరామ్ పాల్గొన్నారు.

రాగోలు జెమ్స్ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీలలిత ఆధ్వర్యాన యోగా వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో పీడీలు జగదీష్, కుశరాజు, వైద్యులు సుజయ్ పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: యోగా ద్వారా మానసిక, శారీరక ఆరోగ్యం పొందుతారని జూనియర్ సివిల్ జడ్జి బి.ఎం.ఆర్.ప్రసన్నలత అన్నారు. జూనియర్ కోర్టు అవరణలో న్యాయవాదులు, కోర్టు సిబ్బంది యోగసనాలు వేశారు. కార్యక్రమంలో న్యాయవాదుల సంఘం అధ్యక్షులు లఖినేని శ్రీనివాసరావు, మండల న్యాయ సేవా సంఘం మెంబర్ వెలమల అప్పలనాయుడు, న్యాయవాదులు మన్మథరావు, కోర్టు సూపరింటెండెంట్ వెంకటరావు పాల్గొన్నారు. అలాగే హరిశ్చంద్రపురం జిల్లా పరిషత్ స్కూల్‌లో నిర్వహించిన యోగా వేడుకల్లో బిజెపి నాయకులు మెట్ట తిరుపతిరావు, ప్రధానోపాధ్యాయులు నూక లక్ష్మణరావు, యోగ ఉపాధ్యాయులు నాగరాజు పాల్గొన్నారు.

టెక్కలిపట్నంలో ఏరువాక


ప్రారంభిస్తున్న వేణుగోపాల్

ప్రజాశక్తి- పలాస

మండలంలోని టెక్కలిపట్నంలో ఎపి రైతు సంఘం ఆధ్వర్యాన శుక్రవారం ఏరువాక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకులు చాపర వేణుగోపాల్ మాట్లాడుతూ రైతాంగ ప్రధాన సమస్యలైన ఎరువులు, విత్తనాలు, పురుగుల మందులు 90 శాతం సబ్సిడీతో రైతులకు అందచేయాలని కోరారు. రైతులు పండించే పంటలకు డాక్టర్ స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం సి2 తోపాటు 50 శాతం కలిపి మద్దతు ధర నిర్ణయించి చట్టబద్ధత కల్పించాలని అన్నారు. అలాగే స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని, 60 ఏళ్ల నిండిన రైతులకు రూ.పది వేలు పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సాగు ప్రణాళికతో పాటు అన్ని పంటలకు లాభదాయక ధర నిర్ణయించి ప్రకటించాలన్నారు. 30,000 ఎకరాలకు నీరు అందించే ఆఫ్‌షోర్ రిజర్వాయరును పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు యు.నేతాజీ, జె.బాబూరావు, జి.వాసుదేవరావు, గోవింద్, తవిటయ్య తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' పనులు కల్పించాలి

ప్రజాశక్తి- పొందూరు

మండలంలోని గోకర్ణపల్లితో పాటు పంచాయతీ పరిధిలోని మున్సీపేట, రంగనాథపేట గ్రామాల్లో ఉపాధి పనులు కల్పించాలని టిడిపి జిల్లా కార్యదర్శి సీపాన శ్రీరంగనాయకులు కోరారు. ఈ మేరకు ఎంపిడిఒ సిహెచ్.సూర్యనారాయణను శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. గత కొంతకాలంగా ఉపాధి పనులు పనులు కల్పించకపోవడంతో ఇబ్బంది పడుతున్నామని తెలిపారు. అలాగే గ్రామంలో ఒకే చెరువులో ఎక్కువగా పనులు జరుపుతున్నారని, మిగిలిన చెరువుల్లోనూ పనులు చేపట్టాలని విన్నవించారు. దీనిపై ఎంపిడిఒ సానుకూలంగా స్పందించి పనులను కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈయనతో పాటు ఎపిఒ పి.శ్రీనివాసరావు ఉన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న ఉపాధి కూలీలు

ప్రియురాలి నిరసన దీక్ష

ప్రజాశక్తి- సోంపేట

మండలంలోని మామిడిపల్లి పంచాయతీ రాజాంకు చెందిన డొక్కరి చిరంజీవి అనే వ్యక్తి ప్రేమ పేరుతో తనను నమ్మించి మోసం చేశాడంటూ మందస మండలం జిల్లుండకు చెందిన యువతీ మంగళవారం మందస పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు శుక్రవారం గ్రామంలోని తన ప్రియుడు చిరంజీవి ఇంటి వద్ద నిరసన దీక్ష చేపట్టింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజాంలోని తన అమ్మమ్మ ఇంటికి తరచూ వస్తుండే దాన్ని అని, ఆ క్రమంలో చిరంజీవితో పరిచయం ఏర్పడి, ప్రేమగా మారిందని తెలిపింది. చిరంజీవి ఉపాధి కోసం విదేశాలకు వెళ్లేవాడని, త్వరలోనే కుటుంబ సభ్యులకు చెప్పి వివాహం చేసుకుంటానని తనను నమ్మించాడని తెలిపింది.


నిరసన తెలుపుతున్న ప్రియురాలు

ఆ నమ్మకంతోనే తామద్దరం ఒకటయ్యమని, ఇప్పుడు పెళ్లి చేసుకోమంటే చేసుకోనంటూ తప్పించుకో తిరుగుతున్నాడని తెలిపింది. తనతోనే తన జీవితం ముడిపడి ఉందని, అందుకే తనకు న్యాయం జరిగే వరకూ ఇక్కడే ఉంటానని విలేకరులకు తెలిపింది. బాధితుడు చిరంజీవి గానీ, అతడి కుటుంబ సభ్యులు గాని అందుబాటులో లేకపోవడంతో తన చిన్నన్న సూచన మేరకు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపింది. గురువారం సాయంత్రం నుంచి చిరంజీవి ఇంటి వద్ద న్యాయం చేయాలని కోరుతూ సునీత నిద్రహారాలు మాని నిరసన వ్యక్తం చేస్తుంది.

కమిషనర్‌కు అభినందనలు


ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ప్రజల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా పట్టణ పౌర సంక్షేమ వేదిక ఆధ్వర్యాన కాలువల్లో పేరుకుపోయిన చెత్తతో పాటు నాలుగు సమస్యలపై నగరపాలక సంస్థ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. వేదిక సభ్యులు నేరుగా ఈ నెల 15న నగరపాలక సంస్థ కార్యాలయానికి వెళ్లి సమస్యలను కమిషనర్ అన్నారియాకు వివరించారు. కన్వీనర్ మాతల గోవర్ధనరావు నేతృత్వంలో సభ్యులు ఎం.ఆదినారాయణమూర్తి, పద్మావతిలు సమస్యలపై చర్చించారు. ప్రధానంగా కాల్వల్లో చెత్త పూడిక తొలగించాలని కోరిక మేరకు నాలుగు రోజుల్లో పూడిక తీత పనులు చేపట్టారు. ఆమె స్పందిన తీరును వేదిక సభ్యులు ప్రశంసిచారు. అయితే తీసిన పూడికను తొలగించకుండా కాలువ పక్కనే విడిచి పెట్టడం, ప్రధాన రోడ్లపై ఎక్కడ చెత్తనిల్వలు అక్కడే ఉండడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. అలాగే తాగునీటి రక్షిత పథకాల్లో క్లోరినేషన్ చేపట్టాలని, దోమలు విజృంభిస్తున్న ప్రాంతాల్లో ఫాగింగ్, దోమల మందు పిచికారీ చేయించాలని కోరారు.

కనకదుర్గమ్మను దర్శించుకున్న శిరీష

ప్రజాశక్తి- పలాస

అమరావతిలో అసెంబ్లీలో ఎమ్మెల్యే ప్రమాణస్వీకారం అనంతరం ఎమ్మెల్యే గౌతు శిరీష విజయవాడ కనకదుర్గమ్మను శుక్రవారం దర్శించుకున్నారు. ఆలయ వేదపండితులు గౌతు శిరీష, వెంకన్న చౌదరికు వేదమంత్రాలు నడుమ స్వాగతం పలికారు. ఆమెతో పాటు టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు, టిడిపి సీనియర్ నాయకులు జి.కె.నాయుడు, శశి, అనిల్ శర్మ, తదితరులు పాల్గొన్నారు.


కనకదుర్గ సన్నిధిలో ఎమ్మెల్యే శిరీష

శివారు భూములకు సాగునీరు


పనులను ప్రారంభిస్తున్న బాబూరావు

ప్రజాశక్తి- పలాస

శివారు భూములకు సాగునీరు అందించడమే టిడిపి ప్రభుత్వం లక్ష్యమని టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు అన్నారు. మండలంలోని మోదుగులపుట్టి వంశధార ప్రధాన కాలువ వద్ద ఉన్న కాలువలో పూడికతీత పనులను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో ఐదేళ్లుగా పలాస, వజ్రపుకొత్తూరు మండలాలకు వంశధార నీరు అందించలేక పోయారన్నారు. మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు శివారు భూములకు సాగునీరు ఏలా సరఫరా చేయాలో ఆలోచన చేయకుండా వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుపై విమర్శలు చేయడం, ఆరోపణలు చేయడంతోనే కాలాన్ని వెల్లబుచ్చారన్నారు. ఖరీఫ్ సమయానికి ముందుగా శివారు భూములకు సాగునీరు సరఫరా చేస్తామన్నారు. వంశధార నీటి జలాలు పంట భూములకు అందించేందుకు మంత్రి, ఎమ్మెల్యే గౌతు శిరీష కంకణం కట్టుకున్నారని తెలిపారు. ఇప్పటికే కాలువలో పూడికతీత పనులు చేపట్టి ఎక్కడ నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపడుతున్నామని చెప్పారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు బి.నాగరాజు, గాలి కృష్ణారావు, సాసుమాన చంద్రమౌళి, అంబటి కృష్ణమూర్తి, తమ్మినాని గంగారం, అవుగాన షణ్ముఖరావు, అవుగాన దశరథ, వంశధార అధికారులు ప్రేమ్ పాల్గొన్నారు.

బోరుభద్ర విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి- సంతబొమ్మాళి

జాతీయ స్థాయి ప్రతిభా పరీక్ష సెమ్స్ ఒలింపియాడ్‌లో మండలంలోని బోరుభద్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు జాతీయ, రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించినట్లు ప్రధానోపాధ్యాయులు పి.రామకృష్ణ తెలిపారు. పాఠశాల ఆవరణలో విజేతలకు శుక్రవారం అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాలకు చెందిన పట్నాన శ్రీమృదుల రాష్ట్రస్థాయిలో 7వ ర్యాంకు సాధించి పాఠశాల పేరు ప్రతిష్టలు ఇనుమడింపజేశారని ప్రశంసించారు. పొట్నూరు హరేంద్ర జోనల్ స్థాయిలో 5వ ర్యాంకు, జవ్వాది జాహ్నవి 9వ ర్యాంకు, సార ఇందు జోనల్ స్థాయి 16వ ర్యాంకు, మార్పు కీర్తిక 17వ ర్యాంకు సాధించినట్లు తెలిపారు. 8వ తరగతి విభాగంలో రాష్ట్రస్థాయిలో కొన్ని విజేంద్ర 10వ ర్యాంకు, భైరి మనీష్ కుమార్ 24వ ర్యాంకు, గన్నవరపు సూర్య 34వ ర్యాంకు సాధించారని చెప్పారు. విజేతలకు నగదు బహుమతులతో పాటు జ్ఞాపిక, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు టి.లోకేశ్వరరావు, డి.ఉమాశంకర్, ఎ.వెంకటరెడ్డి, కె.త్రినాథరావు, బాడాన రాజు, డి.ఉమాదేవి, కె.రమణమ్మ, టి.విజయలక్ష్మి, బి.నాగమణి, కె.తవిటిరెడ్డి, జి.జగదాంబ, బి.రజిని, బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.


అభినందిస్తున్న ఉపాధ్యాయులు

విద్యకు ప్రాధాన్యం


ఆమదాలవలస : కిట్లను అందజేస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి- ఆమదాలవలస

సిఎం చంద్రబాబు నాయుడు విద్యకు ప్రాధాన్యత ఇస్తున్నారని టిడిపి జిల్లా కార్యాలయ సమన్వయ కార్యదర్శి మొదలవలస రమేష్ అన్నారు. పట్టణంలోని గేటు మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులకు స్టూడెంట్ కిట్లను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పేదలందరికీ ఉన్నత విద్య అవకాశాలు కల్పించడానికి వినూత్న ప్రణాళికలు రూపొందిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో టిడిపి వార్డు ఇన్‌ఛార్జి దవళ అప్పలనాయుడు, విస్సు, సతీష్, ప్రధానోపాధ్యాయులు రవణమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బూర్జ : విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించినట్లయితే ఉన్నత శిఖరాలను చేరుకోవచ్చునని ఎంపిపి కర్నెన దీప అన్నారు. మండలంలోని లక్కుపురం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం స్టూడెంట్ కిట్లను పంపిణీ చేశారు. ప్రస్తుతం విద్యార్థుల్లో పోటీతత్వం పెరిగిందన్నారు. దీనివల్ల పట్టుదల పెరిగి అనుకున్న లక్ష్యాన్ని సాధించుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బి.విజయలక్ష్మి, మాజీ సర్పంచ్ సాసుపు శ్రీనివాస్, ఎంపిటిసి ఎం.రామకృష్ణ, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

ముగ్గురికి గాయాలు

నందిగాం : మండలంలోని పూండి రోడ్డు పెంటూరు సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు గాయపడ్డాడరు. వెంటఊరికి చెందిన సనపల నాగభూషణరావు, భార్య లలితమ్మలు తమ ద్విచక్ర వాహనంపై రెయ్యిబోడెమ్మ ఆలయానికి వెళ్తున్నారు. అదే రోడ్డుపై వజ్రపుకొత్తూరు మండలం గోనాలపాడు నుంచి ఎస్.పాపారావు బైక్ వస్తున్నారు. రెండు వాహనాలు పరస్పరంగా ఢీకొనడంతో ముగ్గురూ గాయపడ్డారు. స్థానికులు 108లో టెక్కలి జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. పోలీసుల కేసు దర్యాప్తు చేస్తున్నారు.


శుభాకాంక్షలు తెలుపుతున్న టిడిపి నాయకులు

ఎమ్మెల్యే ఈశ్వరరావుకు శుభాకాంక్షలు

లావేరు: ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు అసెంబ్లీలో శుక్రవారం ప్రమాణస్వీకారం చేశారు. అనంతరం టిడిపి మండల పార్టీ అధ్యక్షులు ముప్పిడి సురేష్ ఆధ్వర్యాన విజయవాడలో ఎమ్మెల్యేను కలిసి శుభాకాంక్షలు తెలిపి ఆనందాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గాన్ని అన్నివిధాలా అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తానని అన్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఎఎంసి మాజీ చైర్మన్ యినపకుర్తి తోటయ్యదొర, బెండు మల్లేశ్వరరావు, అన్నెపు భువనేశ్వరరావు, దరపురెడ్డి కూర్మారావు, ఆర్.ప్రకాశరావు, గొర్లె శ్రీనివాసరావు, ముళ్ల సాయికుమార్ ఉన్నారు.

వరి విత్తనాల పంపిణీ


పలాస : విత్తనాలను పంపిణీ చేస్తున్న ఢిల్లీరావు

పలాస : ఖరీఫ్ సీజన్‌లో ఎటువంటి ఇబ్బందులు లేకుండా రైతులకు విత్తనాలు ఎరువులు అందుబాటులో ఉన్నాయని తెలుగు యువత మండల అధ్యక్షుడు కిక్కర ఢిల్లీరావు అన్నారు. మండలంలోని బొడ్డపాడులో వ్యవసాయశాఖ ఆధ్వర్యాన రైతులకు శుక్రవారం విత్తనాలు ఎరువులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎవరికైనా విత్తనాలు ఎరువులు అవసరమైతే రైతు భరోసా కేంద్రాల వద్దకు వెళ్లి తీసుకోవచ్చు అన్నారు. కార్యక్రమంలో దాసరి శ్రీరాములు, బొడ్డు దుష్యంత్, పత్రి తాతారావు, సారా జోగారావు, ముడిపంటి ఖగేష్, బొడ్డు జగన్, బొడ్డు మోహన్, బుడత కాంతారావు, గూడ గోపాల్, అగ్రికల్చర్ అసిస్టెంట్ తెప్పల పావని పాల్గొన్నారు.

టెక్కలి రూరల్ : టెక్కలి మండలం రావివలస రైతు భరోసా కేంద్రంలో టిడిపి నాయకులు ఎల్.ఎల్.నాయుడు, మాజీ సర్పంచ్ బడే జగదీష్ రైతులకు వరి విత్తనాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నర్తు కృష్ణ, ఇప్పిలి జగదీష్, దాసరి వాసు పాల్గొన్నారు.

సంతబొమ్మాళి : రైతులకు టిడిపి నాయకులు వారధి చంటి రైతులకు విత్తనాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ కోడ దామోదర్, మాజీ ఉప సర్పంచ్ అడ్డ అప్పారావు, మూగు రామారావు పాల్గొన్నారు.


పొందూరు : విత్తనాలను పంపిణీ చేస్తున్న నాయకులు

పొందూరు: మండలంలోని కింతలిలో సర్పంచ్ పైడి రాంప్రసాద్, ఎంపిటిసి కూటికుప్పల హనుమంతురావు రైతులకు వరి విత్తనాలను పంపిణీ చేశారు. అలాగే స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు స్టూడెంట్ కిట్లను అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ అమ్మాజీ, నాయకులు అరుణ, రామారావు, పవన్, చిన్నా, విఎఎ ఎస్.శివ పాల్గొన్నారు. అలాగే దల్లిపేటలో మాజీ సర్పంచ్ బి.రఘురాంరెడ్డి రైతులకు వరి విత్తనాలను పంపిణీ చేశారు.


సన్మానిస్తున్న టిడిపి నాయకులు

ఎమ్మెల్యే శిరీషకు సన్మానం

ప్రజాశక్తి- పలాస

అమరావతిలో శుక్రవారం ఎమ్మెల్యే గౌతు శిరీష అసెంబ్లీలో ప్రమాణస్వీకారం చేశారు. అనంతరం టిడిపి సమన్వయకర్త యార్లగడ్డ వెంకన్న చౌదరికు మర్యాదపూర్వకంగా కలిసి దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర బిసి సెల్ ప్రధాన కార్యదర్శి లొడగల కామేశ్వరరావు, కౌన్సిలర్ గురిటి సూర్యనారాయణ, మాజీ కౌన్సిలర్లు సవర రాంబాబు, కొండే నర్సింహులు, చంద్రశేఖర్ త్యాడి తదితరులు పాల్గొన్నారు.


ప్లేట్లు అందజేస్తున్న వెంకటేష్

విద్యార్థులకు ప్లేట్లు వితరణ

బూర్జ : మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఎన్ఆర్ఐ వ్యాపారి వెంకటేష్ శుక్రవారం ప్లేట్లను పంపిణీ చేశారు. విద్యార్థులకు కనీస అవసరాలను తీర్చినట్లయితే వారు చదువుపై శ్రద్ధ చూపుతారని అన్నారు. అలాగే తనశక్తి మేరకు సేవా కార్యక్రమాలు చేపడతానని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎంపిటిసి సిహెచ్.పోలినాయుడు, గిరి, భోగిరాజు పాల్గొన్నారు.


ర్యాలీ నిర్వహిస్తున్న టిడిపి నాయకులు

టిడిపి నాయకుల విజయోత్సవ ర్యాలీ

నౌపడ : వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రమాణస్వీకారం సందర్భంగా సంతబొమ్మాళి మండలం నౌపడ మేజర్ పంచాయతీలో టిడిపి నాయకులు సుగ్గు శాంతి స్వరూప రెడ్డి ఆధ్వర్యాన నాయకులు శుక్రవారం విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. పంచాయతీలోని కూర్మాదపురం, పాలనాయుడుపేట, జగన్నాథపురం, సీతానగరం, నౌపడ గ్రామాల్లో ఊరేగింపుగా వెళ్లారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు చెన్నూరు గౌరీశంకర్, బాబ్జి, వాడరేవు కృష్ణ, బత్సల హరిచంద్రరావు, మహంతి రాజు, బాలకృష్ణ, శంకర్, నీలాపు దాలయ్య పాల్గొన్నారు.

ఎంపిడిఒగా రాజారావు

నందిగాం : నందిగామ మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారిగా ఇఒపిఆర్‌డిగా విధులు నిర్వహించిన టి.రాజారావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. జిల్లా పరిషత్ ముఖ్య కార్య నిర్వహణ అధకారి ఆదేశాల మేరకు బాధ్యతలు చేపట్టినట్లు తెలిపారు. ఇంతకుముందు ఇక్కడ ఎంపిడిఒగా పనిచేసిన జి.శివప్రసాద్ స్వచ్ఛంద ఉద్యోగ విరమణ పొందారు. ఆయన స్థానంలో రాజారావును నియమించారు.


రాజారావు

ర్యాలీని విజయవంతం చేయాలి


మాట్లాడుతున్న విద్యాసాగర్

ప్రజాశక్తి- ఆమదాలవలస

ఈ నెల 23న ఎమ్మెల్యే కూన రవికుమార్ విజయోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్నామని, దీనిని విజయవంతం చేయాలని టిడిపి నాయకులు తమ్మినేని విద్యాసాగర్, సనపల ఢిల్లేశ్వరరావులు కోరారు. పట్టణంలోని టిడిపి కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గ చరిత్రలో అత్యధిక మెజార్టీతో విజయం సాధించి రవికుమార్ శుక్రవారం ప్రమాణస్వీకారం చేశారని తెలిపారు. 23న ఉదయం తొమ్మిది గంటలకు విశాఖపట్నం విమానాశ్రయానికి చేరుకుంటారని అన్నారు. అక్కడి నుంచి ఒంటి గంటకు సింహద్వారం వద్దకు చేరుకొని జిల్లా కేంద్రంలోని ప్రముఖ నాయకుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళ్లర్పిస్తారి తెలిపారు. అక్కడి నుంచి ఆమదాలవలస శివారున ఇండస్ట్రియల్ ఎస్టేట్ వద్ద ఉన్న ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ర్యాలీగా కృష్ణాపురం వరకు చేరుకుంటుందని అన్నారు. అక్కడ సమావేశం నిర్వహిస్తారని తెలిపారు. సమావేశంలో టిడిపి నాయకులు మొదలవలస రమేష్, బొడ్డేపల్లి గౌరీపతిరావు, అన్నెపు భాస్కర రావు, నేతింటి జ్యోతీశ్వరరావు, సంపదరావు మురళి, వండాన ఉదయ్‌కుమార్, బోనెల అప్పారావు, సనపల చెల్లంనాయుడు, ఎండ అప్పలనాయుడు, చేపేన సత్తిరాజు పాల్గొన్నారు.

పక్కాగా సోషల్ ఆడిట్

ప్రజాశక్తి- కవిటి

మండలంలోని శనివారం నుంచి 17వ సోషల్ ఆడిట్ పక్కాగా నిర్వహించనున్నట్టు స్టేట్ రిసోర్స్‌పర్సన్ పున్నపునాయుడు, ఎపిడి శ్రీనివాసరెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో ఎన్‌ఆర్‌జిఎస్, సామాజిక పింఛన్ల సోషల్ ఆడిట్‌కు సంబంధించి శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి పంచాయతీలో సోషల్ ఆడిట్ టీమ్ పర్యటిస్తుందని తెలిపారు. పంచాయతీలో జరిగిన ఉపాధి పనులు, సామాజిక పింఛన్ల పంపిణీకి చెందిన పూర్తిస్థాయి రికార్డులతో సిద్ధంగా ఉండాలని సూచించారు. ఎంపిడిఒ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ మండలంలో రూ.10,38,10,600 కోట్లు మంది ఉపాధి కూలీలకు కూలి చెల్లించినట్లు తెలిపారు. అలాగే రూ.3,53,6,037 కోట్లు మెటీరియల్‌కు చెల్లించగా, హౌసింగ్‌తో కలసి 3678 పనులు చేపట్టినట్టు తెలిపారు. సమావేశంలో ఇఒపిఆర్‌డి శివాజీ పాణిగ్రాహి, పిఆర్ ఎఇఇ ప్రవీణ్‌కుమార్, ఎపిఒ టి.మోహనరావు, విశ్రాంత ఎపిఒ కడియం భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న శ్రీనివాసరెడ్డి


మృతి చెందిన ఆవు

పిడుగుపాటుకు ఆవు మృతి

లావేరు : రణస్థలం మండలం జె.ఆర్.పురం పంచాయతీ సీతంవలసగొల్లపేట గ్రామానికి చెందిన పిట్ట ఆశిరప్పడుకు చెందిన ఆవు శుక్రవారం రాత్రి కురిసిన భారీ వర్షం సమయంలో పిడుగు పడి ఆవు మృతి చెందింది. ఇంటి సమీపంలో ఉన్న తాటి చెట్టు వద్ద ఉన్న ఆవును కట్టారు. చెట్టుపై పిడుగు పడడంతో ఆవు మృతి చెందింది. దీని విలువ రూ.80 వేలు ఉంటుందని యజమాని కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నాడు.


జెర్సీలను అందజేస్తున్న వెంకటేష్

క్రీడాకారులకు జెర్సీలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో ఎంతో మంది క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించి జాతీయ, అంతర్జాతీయ వేదికలపై కీర్తి ప్రతిష్టలు పెంచారని, అదేతరహాలో క్రికెట్‌లోను యువత రాణించి జాతీయ, అంతర్జాతీయ జట్లలో ప్రాతినిధ్యం వహించాలని నగర టిడిపి అధ్యక్షులు మాదారపు వెంకటేష్ అన్నారు. నగరంలోని ఆర్ట్స్ కళాశాలలో జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను శుక్రవారం ప్రారంభించారు. ముందుగా నగరంలోని పెద్దరెల్లి వీధికి చెందిన క్రికెట్ జట్టుకు మాదారపు డేవిడ్‌తో కలిసి జర్సీలను అందజేశారు. జిల్లాస్థాయిలో 10 ఓవర్ల క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. 34 క్రికెట్ టీమ్‌లు ఈ పోటీల్లో పాల్గొంటున్నట్టు చెప్పారు. ఎమ్మెల్యే గొండు శంకర్ ప్రమాణస్వీకారం సందర్భంగా కేక్‌ను కట్ చేసి అందరికీ తినిపించారు. కార్యక్రమం జైభీమ్, శభరి ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు రవి, కూర్మారావు, గోపాలరావు, జ్యోతి, చందు, చాణక్య పాల్గొన్నారు.

సిక్కోలు చిత్రాలు సిడి ఆవిష్కరణ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

యూట్యూబ్ ప్రేమ్ సుప్రీం ఆధ్వర్యాన నిర్మిస్తున్న సిక్కోలు చిత్రాలు వెబ్ సీరిస్ సిడిని నగరంలోని ఆర్ట్స్ కాలేజీ మైదానంలో ప్రిన్సిపాల్ పి.సురేఖ శుక్రవారం ఆవిష్కరించారు. వెబ్ సిరీస్‌ను యూట్యూబ్‌లో ఈ నెల 22 సాయంత్రం 4 గంటలకు అందుబాటులో ఉంటుందని చిత్ర దర్శకులు గజల్ వాసుదేవ్ తెలిపారు. గతంలో ఈ ఛానల్ ద్వారా ఎన్నో సందేశాత్మక షార్ట్ ఫిల్మ్‌లు గతంలో రూపొందించినట్టు తెలిపారు. ఈ ఛానల్ రూపొందిన 'అంకుర' షార్ట్ ఫిలిం నేషనల్ ఇంటర్నేషనల్ అవార్డులు సైతం దక్కించుకున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో బాబూరావు, రమేష్ నారాయణ్, రమణమణి, వాసుదేవ్, నేతింటి, మిథున్ పాల్గొన్నారు.

అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

ఇచ్ఛాపురం: అభివృద్ధిపై ప్రత్యేక దృష్టిసారించాలని మాజీ ఎంపిపి దక్కత ఢిల్లీరావు అన్నారు. మండలంలోని కేశుపురం పంచాయతీ కార్యాలయంలో కూటమి ప్రభుత్వంలో చేపట్టనున్న భవిష్యత్ అభివృద్ధి కార్యక్రమాలపై సచివాలయ సిబ్బందితో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ముందుగా అధికారులతో, నాయకులతో పరిచయం చేసుకున్నారు. ప్రజలకు నిస్వార్థంగా సేవలు అందించేవిధంగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు గుజ్జి భీమారావు, నరేంద్ర, కామేశ్వరరావు, పురుషోత్తం, జోగారావు, తిమ్మరాజు, తిరుపతి, హరికృష్ణ, వెంకటరావు, కుమార్, సంతోష్, కార్యదర్శి కృష్ణ, విఆర్‌ఒ శంకర్ పాల్గొన్నారు.

సంఘాల బలోపేతానికి చర్యలు


మాట్లాడుతున్న రవికుమార్

పొందూరు: స్వయం సహాయక సంఘాలు ద్వారా మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు ఏరియా కో- ఆర్డినేటర్ పి.రవికుమార్ అన్నారు. పొందూరులో ఎపిఎం గురుగుబెల్లి శ్యామలరావు అధ్యక్షతన విఒఎలతో శుక్రవారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి, ఆసరా, సంఘాల ఖాతా పుస్తకాల నిర్వాహణ వంటి పలు అంశాలపై గ్రామాల వారీగా నెలవారీ సమీక్షించాలన్నారు. సమావేశంలో సిసి సత్యనారాయణ, సూర్యప్రభ, త్రినాథమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ యంత్రం ఏర్పాటుకు చర్యలు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

శ్మశానవాటికలో మృతదేహాల దహన సంస్కారాలకు రూ.లక్షలతో విద్యుత్ యంత్రం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని రోటరీక్లబ్ ప్రతినిధులు తెలిపారు. దేశంలో పూరి, కాశీ వంటి క్షేత్రాలు, మెట్రోపాలిటన్ నగరాల్లో ఇటువంటి దహన సంస్కార ప్రక్రియ కొనసాగుతుందని అన్నారు. వర్షాలు, వరదలు సమయంలో ఇక్కట్లు పడకుండా ఉండేందుకు యంత్రం అవసరమని గుర్తించామన్నారు. దీనిపై ప్రజలతో చర్చించేందుకు శనివారం మధ్యాహ్నం 2 గంటలకు రోటరీ హాల్‌లో పౌర సమావేశం నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజలు, పురోహితుల సూచనలు, సలహాలు, అభ్యంతరాలు తెలుసుకొనేందుకు ముందు వాటిని ప్రజల సమక్షంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని అన్నారు. ఈ సమావేశానికి పుర ప్రజలు పాల్గొని సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు.


మరమ్మతులు చేయిస్తున్న సర్పంచ్ రవికుమార్

బోరుకు మరమ్మతులు

ప్రజాశక్తి- రణస్థలం

మండలంలోని తిరుపతిపాలె పంచాయతీలో పలు గ్రామాల్లో సర్పంచ్ ఆకుల రవికుమార్ ఆధ్వర్యాన శుక్రవారం మరమ్మతులు చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంచాయతీ పరిధిలో ఎవరూ తాగునీటికి ఇబ్బంది పడకూడదని, అందులో వర్షాకాలంలో విద్యుత్ సమస్యలు ఉన్నందున బోర్లకు పంపుల ద్వారా ఈ సమస్యలను అధిగమించవచ్చని పేర్కొన్నారు. గ్రామాల్లో బోర్లు మరమ్మతులకు గురైతే తక్షణమే తెలియజేస్తే తక్షణమే మరమ్మతులు చేయిస్తామని తెలిపారు.

పారిశుధ్య పనులు పరిశీలన

కొత్తూరు : పారిశుధ్య వారోత్సవాల భాగంగా మండలంలోని పారాపురం, సిరుసువాడ, మెట్టూరుగూడ గ్రామాల్లో శుక్రవారం ముమ్మరం గా పారిశుధ్య పనులు చేపట్టారు. సిరువాడలోని పారిశుధ్య పనులను ఎంపిడిఒ త్రివిక్రమరావు పరిశీలించారు. కార్యక్రమంలో సిరిసువాడ సర్పంచ్ వలరౌతు పోలినాయుడు పాల్గొన్నారు.

నీటి ట్యాంకులో క్లోరినేషన్

ప్రజాశక్తి- పొందూరు

మండలంలోని కృష్ణాపురంలో సర్పంచ్ ప్రతినిధి అంబళ్ల శ్రీనివాసరావు పర్యవేక్షణలో రక్షిత తాగునీటి ట్యాంకును శుభ్రపరిచారు. కొంతకాలంగా ట్యాంకులో పేరుకుపోయిన నాచును తొలగించి శుభ్రపరిచి క్లోరినేషన్ చేశారు. ఈయనతో పాటు జనసేన నాయకులు బాబూరావు, సచివాలయం సిబ్బంది ఉన్నారు.

రేపు పుస్తకావిష్కరణ సభ

ప్రజాశక్తి- ఆమదాలవలస

ఈ నెల 23న పట్టణంలో పుస్తకావిష్కరణ సభ నిర్వహిస్తున్నామని విశ్వ సాహితీ అధ్యక్షులు పొన్నాడ వరాహ నరసింహులు ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని గేటులో ఉన్న ప్రభుత్వం ఉన్నత పాఠశాలలో ఉదయం 9.30 గంటలకు తెలుగు కవుల కవితా సంకలనం కవనవనం, కవి కర్నేన జనార్ధనరావు రాసిన దేశభక్తి జాతీయవాదం, కవి, రచయిత పొన్నాడ వరాహ నరసింహులు రాసిన వినుడు మంచి మాటలు అనే మూడు గ్రంథాలు ఆవిష్కరింపబడతాయని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కథారచయిత అట్టాడ అప్పలనాయుడు, కవి, రచయిత గంటేడ గౌరీనాయుడు, ఉపన్యాసకులు డాక్టర్ సనపల నారాయణమూర్తి, సాహితీ ప్రస్థాన పత్రికా సంపాదకులు చీకటి దివాకర్, విశిష్ట అతిథులుగా రాజాం రచయితల వేదిక కన్వీనర్ గార రంగనాథం, కవి బమ్మిడి సుబ్బారావు, యువ కవి కంచరాన భుజంగరావు, ప్రత్యేక ఆహ్వానితుడిగా ఇంటర్మీడియట్ విశ్రాంత విద్యాశాఖ అధికారి పాత్రుని పాపారావు, ఎంఇఒ గెడ్డాపు రాజేంద్రప్రసాద్, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు డాక్టర్ కల్లేపల్లి అప్పలరాములు, రోటరీ క్లబ్ అధ్యక్షులు కాకితాపల్లి సంజీవరావు పాల్గొంటారని తెలిపారు.

నాదెండ్లను కలిసిన ఎండియు ఆపరేటర్లు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ప్రజాపంపిణీ వ్యవస్థలో గత ప్రభుత్వం తీసుకొచ్చిన ఎండియు వ్యవస్థను కొనసాగించి ప్రజలకు మెరుగైన సేవలందించడానికి తోడ్పాటు అందివ్వాలని ఎండియూ ఆపరేటర్ల యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు రౌతు సూర్యనారాయణ కోరారు. కొత్తగా పౌరసరఫరాల మంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాదెండ్ల మనోహర్‌ను శుక్రవారం విజయవాడలో ఎండియు ఆపరేటర్ల సంఘం రాష్ట్ర నాయకులతో పాటు ఆయన మరాద్య పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎండియూ ఆపరేటర్లు సమస్యలతో కూడిన వినతి పత్రం అందజేశారు. అనంతరం కమిషనర్ హనుమంతు అరుణ్‌కుమార్‌ను మర్యాదపూర్వంగా కలిశారు. కలిసిన వారిలో ఎండియు ఆపరేటర్ల అసోసియేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు రౌతు సూర్యనారాయణ, అధ్యక్షులు కిషోర్‌కుమార్, ఉపాధ్యక్షులు రవికుమార్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, కోశాధికారి సాంబశివరావు ఉన్నారు.


మంత్రి మనోహర్‌కు వివరిస్తున్న ఎండియు ఆపరేటర్లు


పరిశీలిస్తున్న ఆర్‌డిఒ భరత్ నాయక్

హుదూద్ ఇళ్లు పరిశీలన

ప్రజాశక్తి- సోంపేట

సోంపేటలోని హుదూద్ నిర్మాణ పనులను పలాస ఆర్‌డిఒ భరత్ నాయక్ శుక్రవారం పరిశీలించారు. సందర్భంగా మాట్లాడుతూ నివాస యోగ్యంగా మార్చేందుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో విఆర్‌ఒలు, విలేజ్ సర్వేయర్లతో సమీక్ష నిర్వహించారు. గ్రామస్థాయిలో ప్రభుత్వ భూములు గుర్తింపు, ఆక్రమణలు, ఇసుక, మట్టి అక్రమ రవాణా, పారిశుధ్య నిర్వహణ, పౌర సరఫరాల పంపిణీపై మాట్లాడారు. ఈ శాఖలకు సంబంధించి పూర్తి సమాచారాన్ని అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహశీల్దార్ విజయ్ కుమార్, ఆర్ఐ రవికుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

విత్తనశుద్ధి తప్పనిసరి

నందిగాం : విత్తన శుద్ధి చేయడం ద్వారా రైతులకు మేలైన దిగుబడి పొందే అవకాశం ఉందని మండల వ్యవసాయ అధికారి పి.శ్రీకాంత్ వర్మ అన్నారు. మండలంలోని లఖిదాసుపురం సచివాలయ పరిధిలో మొండిరావివలసలో విత్తన శుద్ధి చేసే విధానం గురించి రైతులకు వివరించారు. కేజీ విత్తనానికి 10 గ్రాముల సూడోమోనస్ పౌడరు కలిపి వాడడం వల్ల వరికి తెగుళ్ల రాకుండా నివారించుకోవచ్చునని సూచించారు. మట్టి పరీక్షలకు గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో విఎఎ ప్రగడ వాసవి, రైతులు గున్న వైకుంఠరావు, పురట ఉమాపతి, ఆరింగి వెంకటేశ్వరరావు, ఎన్.రాంబాబు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న ఎఒ శ్రీకాంత్‌వర్మ


వినతిపత్రం అందజేస్తున్న కళ్యాణమిత్రలు

విధుల్లోకి తీసుకోవాలని వినతి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

నియోజకవర్గంలో టిడిపి హయాంలో చంద్రన్న పెళ్లి కానుక అనే పథకాకి పది మంది కళ్యాణ మిత్రలు పనిచేశామని, తమకు మళ్లీ విధుల్లోకి తీసుకోవాలని కోరారు. ఈ మేరకు జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి దాసరి రాజును శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో కళ్యాణ మిత్రలుగా 18 నెలలు విధుల్లో కొనసాగించామన్నారు. కానీ, దాన్ని తగ్గ ఇన్‌సెంటివ్ అందలేదని అన్నారు. కూటమి ప్రభుత్వం తమను విధుల్లోకి తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జి.లక్ష్మి, బి.రోహిని, ఎం.రేణుక, పుష్ప, నాని, పూజ, అరుణ, హేమలత పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

కవిటి: మండలంలోని 33/11 కె.వి.రాజాపురం విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతులు కారణంగా శనివారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఇఇ జి.ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. 33 కెవి లైన్ మైంటేనెన్స్ పనులు, చెట్లు కొమ్మలు తొలగించనున్న నేపథ్యంలో కవిటి, రాజపురం, శిలగాం, జగతి, భైరిపురం, డి.జి.పుట్టుగ, కపాసుకుద్ది, నెలవంక, బెలగాం, సహలాలపుట్టుగ, గొర్లెపాడు, కొజ్జిరియా, కరాపాడు పంచాయతీల పరిధిలోని గ్రామాలకు, వ్యవసాయ సర్వీసులకు, ఆర్‌డబ్ల్యూఎస్ కనెక్షన్లలకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని అన్నారు. వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని కోరారు.



పరిశీలిస్తున్న హరిప్రసాద్

'108' పరిశీలన

ప్రజాశక్తి- పలాస

పలాస మండల కేంద్రంలో 108 అంబులెన్స్ సేవలను జిల్లా అధికారి బి.హరిప్రసాద్, డివిజనల్ ఆపరేషన్ అధికారి గండేపల్లి జగన్నాథరావు శుక్రవారం పరిశీలించారు. వాహన నిర్వహణ తీరు పరికరాల పనితీరుతో పాటు అత్యవసర మందుల నిర్వహణ రికార్డు డ్యూటీ చార్టు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. మెరుగైన సేవలు అందించాలని, అత్యవసర సమయంలో మరింత బాధ్యతగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో 108 సిబ్బంది బి.తారకేశ్వరరావు, కె.శ్రీనివాసరావు సత్యం, వెంకట్‌రావు, మోహనరావు, ఎం.రామచంద్రరావు పాల్గొన్నారు.